


షణ్ముఖ
SHANMUKHAVELUGU
RNI : APTEL / 2023 / 89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక




సంపుటి : 2 సంచిక : 355 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ గురువారం 25 డిసెంబర్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 355 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Thursday 25 December 2025 PAGES : 8 PRICE : 3/-

## వృద్ధురాలికి ఇచ్చిన మాట కోసం..



## ఇప్పటంలో పవన్ పర్యటన

(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 24)

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఇప్పటం చేరుకున్నారు. వైకాపా హయాంలో రోడ్డు విస్తరణ పేరుతో ఇప్పటంలో జనసేన కార్యకర్తల ఇళ్లు కూల్చివేశారు. జనసేన ఆవిర్భావ సభకు భూములు ఇచ్చారనే కక్షతో ఇలా చేశారనే ఆరోపణలున్నాయి. అప్పట్లో పవన్ కల్యాణ్ ఈ గ్రామంలో పర్యటించి బాధితులకు ధైర్యం చెప్పారు. ఎన్నికల్లో గెలిచాక మళ్లీ రావాలని ఇండ్ల నాగేశ్వరమ్మ అనే వృద్ధురాలు ఆయన్ను కోరింది. ఈ నేపథ్యంలో ఆమెకు ఇచ్చిన మాట మేరకు ఇప్పటం చేరుకున్న పవన్.. నాగేశ్వరమ్మ -మిగతా 2లో

## మమ్మల్ని బాధపెట్టిన ఎవర్నీ విడిచిపెట్టం: మంత్రి సంధ్యారాణి




(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 24)

రాజకీయంగా ఎదుర్కోలేకే.. తన కుటుంబం, వ్యక్తిగత సహాయకుడి(పీఏ)పై నింద మోపారని ఏపీ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఎలాంటి తప్పు చేయకపోయినా తీవ్ర ఆరోపణలు చేశారని చెప్పారు. "వాస్తవాలు తెలుసుకోకుండా కొన్ని ఛానళ్లు నా కుటుంబాన్ని అభాసుపాల్జేశాయి. నెల రోజుల పాటు నన్ను ఎంతో బాధపెట్టారు. నన్ను, నా కుమారుడిని బాధపెట్టిన ఎవర్నీ విడిచిపెట్టేది లేదు. ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ చేయాలని సైబర్ క్రైమ్ అధికారులను కోరా" అని సంధ్యారాణి తెలిపారు.

మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వ్యక్తిగత సహాయకుడు (పీఏ) సతీశ్, ఆమె కుమారుడిపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి మంగళవారం స్పష్టం చేశారు. వాట్సప్‌లో అసభ్యకర సమాచారం పంపినట్లు ఓ మహిళ చేసిన ఆరోపణల్లో నిజం లేదని చెప్పారు. ఈ నేపథ్యంలో మంత్రి నేడు మాట్లాడారు.

# ఐటీకి సిలికాన్ వ్యాలీ.. క్వాంటమ్‌కు అమరావతి




- రాజధాని నుంచే దేశ క్వాంటమ్ కంప్యూటింగ్ భవిష్యత్తు నిర్మాణం
- ఈ టెక్నాలజీలో ఏపీ నుంచి నోబెల్ సాధిస్తే రూ.100 కోట్ల నజరానా
- రెండేళ్లలో అమరావతి నుంచి కంప్యూటర్ల ఎగుమతి
- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి
- విద్యార్థులను ఉద్దేశించి ఆన్‌లైన్‌లో ప్రసంగం
- వైసర్, క్యూబిటెక్ సంస్థలతో కలిసి 54వేల మందికి శిక్షణ ఇస్తున్న ప్రభుత్వం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 24)

రాష్ట్రం నుంచి క్వాంటమ్ టెక్నాలజీలో నోబెల్ బహుమతి సాధించినవారికి రూ.100 కోట్ల నజరానా అందిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అమరావతిని ప్రపంచంలోని ఐదు అగ్రశ్రేణి క్వాంటమ్ హబ్‌లలో ఒకటిగా తీర్చిదిద్దుతామన్నారు. భారతదేశంలో ఈ టెక్నాలజీలో విప్లవానికి ఏపీ నాయకత్వం వహిస్తుందన్నారు. 180 రోజుల్లో అమరావతిలో క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటుచేస్తామని, రెండేళ్లలో అమరావతిలోనే కంప్యూటర్లు ఉత్పత్తి చేసి... విదేశాలకు ఎగుమతి చేస్తామని పేర్కొన్నారు. "ప్రపంచ ఐటీ రంగానికి కేంద్రస్థానం సిలికాన్ వ్యాలీ. రాబోయే రోజుల్లో క్వాంటమ్ కంప్యూటింగ్‌కి అమరావతి కేంద్రంగా మారుతుంది. కొత్త కంపెనీలు ప్రారంభించేందుకు, సాంకేతికతల ఆవిష్కరణకు అందరూ ఇక్కడికే వస్తారు" అని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం, వైసర్, క్యూబిటెక్ సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో నమోదుచేసుకున్న 54వేల మంది విద్యార్థులతో ముఖ్యమంత్రి మంగళవారం ఉదయం 'క్వాంటమ్ టాక్ బై సీబీఎన్' కార్యక్రమం నిర్వహించారు. -మిగతా 2లో

## ఆప్కోలో సంక్రాంతి రాయితీలు: మంత్రి సవిత



(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 24)

సంక్రాంతి సందర్భంగా ఆప్కో షోరూంలలో భారీ రాయితీలపై వస్త్రాలు విక్రయించనున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత తెలిపారు. 60, 50, 40 శాతం రాయితీలపై చేనేత వస్త్రాల విక్రయాలు ఉంటాయని వెల్లడించారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో చేనేత, జౌళి శాఖల అధికారులతో మంత్రి సవిత మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. "సంక్రాంతిని దృష్టిలో పెట్టుకుని -మిగతా 2లో

## మన ప్రభుత్వం వస్తుంది.. ధైర్యంగా ఉండండి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 24)

'మన ప్రభుత్వం వస్తుంది.. ధైర్యంగా ఉండండి' అంటూ మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైకాపా కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. మంగళవారం ఆయన బెంగళూరు నుంచి వైఎస్సార్ కడప జిల్లా పులివెందులకు చేరుకున్నారు. దాదాపు మూడు గంటలసేపు తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. పలువురు వైకాపా నాయకులు, కార్యకర్తలు కూటమి -మిగతా 2లో



## రుషికొండ ప్యాలెస్ వినియోగంపై సబ్ కమిటీ భేటీ

### హాస్పిటాలిటీ ఇండస్ట్రీ కోసం వినియోగించే అంశాన్ని పరిశీలించామన్న కేశవ్

### గత వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన కందుల దుర్గేశ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 24)

విశాఖలోని రుషికొండ ప్యాలెస్ వినియోగంపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ మూడవ సమావేశం ఈరోజు జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేశ్, పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, టూరిజం ఎండీ, ఏపీ టీఏ సీఈఓ ఆమ్రపాలి, పర్యాటక శాఖ అధికారులు పాల్గొన్నారు. మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి వర్చువల్‌గా చేరారు. ప్యాలెస్‌ను హాస్పిటాలిటీ ఇండస్ట్రీ కోసం వినియోగించాలా? అనే అంశాన్ని పరిశీలించామని పయ్యావుల తెలిపారు. హోటల్ కోసం అదనపు స్థలం కావాలని కొందరు అడిగారని చెప్పారు. రుషికొండ కింద ఉన్న 9 ఎకరాల్లో 7 ఎకరాలు సీఆర్ జెడ్ నిబంధనల పరిధిలోకి వస్తాయని, అందులో ఎలాంటి నిర్మాణం జరపరాదని స్పష్టంచేశారు. ఇక ప్యాలెస్ చివరి రెండు బ్లాక్‌లు ప్రజలకు, సాంస్కృతిక కార్యక్రమాలకు, టూరిజం అవసరాలకు ఉంచబడతాయని తెలిపారు. తాజ్ గ్రూప్, లీలా హోటల్ గ్రూప్, -మిగతా 2లో

## టీటీడీలో అక్రమాలను వెలికితీస్తున్నాం

### జగన్ పాలనలో తిరుమలలో ఘోరాలు జరిగాయన్న మంత్రి జనార్ధన్ రెడ్డి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 24)

సంక్రాంతి నాటికి రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లే లక్ష్యం

గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో పవిత్ర తిరుమల క్షేత్రంలో అనేక అక్రమాలు, మహాపాపాలు జరిగాయని రాష్ట్ర కార్మిక, పరిశ్రమల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. భక్తులు ఎంతో పవిత్రంగా భావించే లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిందని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలు ఇప్పుడు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో కలియుగ దైవం శ్రీవెంకటేశ్వర స్వామి దర్శనానికి దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, వారి సౌకర్యాల విషయంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా నిర్లక్ష్యం వహించిందని జనార్ధన్ రెడ్డి విమర్శించారు. అప్పటి టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి పాత్రపై కూడా ఇప్పుడు ప్రజలకు స్పష్టత వస్తోందని, అయితే ఆ వ్యవహారాలు న్యాయస్థానాల పరిధిలో ఉన్నందున ఎక్కువగా మాట్లాడటం లేదని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరుమలలో ప్రక్షాళన మొదలుపెట్టామని, ప్రసాదాలకు -మిగతా 2లో

## 'ప్రజా భాగస్వామ్యం' జాతీయ భద్రతకు మూలస్తంభం: ద్రౌపదీ ముర్ము



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,డిసెంబర్ 24)

సమాజ భాగస్వామ్యం జాతీయ భద్రతను బలపరుస్తుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వ్యాఖ్యానించారు. ప్రజలు తమ చుట్టూ ఏం జరుగుతుందో నిష్క్రియాత్మకంగా పరిశీలించాల్సిన అవసరం లేదని.. అయితే, తమ సొంత పరిసరాలు, దాని వెలుపల ఉన్న ప్రాంతాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. 'జన్ భాగీదారి(ప్రజా భాగస్వామ్యం)' ప్రజా-కేంద్రీకృత భద్రతకు మూలస్తంభమని ఆమె పేర్కొన్నారు. ఇంటెలిజెన్స్ బ్యూరో ఆధ్వర్యంలో దిల్లీలో నిర్వహించిన 'ప్రజా-కేంద్రీకృత జాతీయ భద్రత, వికసిత్ భారత్ నిర్మాణంలో సమాజ భాగస్వామ్యం' అనే కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. సామాజిక మాధ్యమం సమాచార, కమ్యూనికేషన్ ప్రపంచాన్ని మార్చివేసిందని పేర్కొన్నారు. 'తప్పుడు వార్తల నుంచి ప్రజలను రక్షించడం చాలా సవాలుతో కూడిన పని. ఈ చర్యను నిరంతరం, చాలా ప్రభావవంతంగా కొనసాగించాలి. దేశానికి ఉపయోగపడే నిజమైన సమాచారాన్ని అందించే క్రియాశీల వినియోగదారులతో ఒక సంఘాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది' అని ఆమె అభిప్రాయపడ్డారు.

## దివ్యాంగులకు త్వరలో త్రిచక్ర మోటారు వాహనాలు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 24)

దివ్యాంగుల సంక్షేమం, గౌరవానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తూ, దేశంలో ఎక్కడా లేనివిధంగా వారికి నెలకు రూ.6 వేల పింఛన్ ఇస్తోందని దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రిని పలువురు



దివ్యాంగులు కలిశారు. దివ్యాంగులకు ఏడు వరాలైన ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, అమరావతిలో దివ్యాంగ భవన్, స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం, క్రీడల్లో ప్రోత్సాహం, ప్రత్యేక ఆర్థిక రాయితీలు, బహుళ అంతస్తుల ప్రభుత్వ గృహనిర్మాణ ప్రాజెక్టుల్లో గ్రౌండ్ ఫ్లోర్ కేటాయింపు, వైద్య- సామాజిక భద్రత ప్రకటించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి స్వామికి వారు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి స్పందిస్తూ దివ్యాంగులకు త్వరలో ఉచితంగా మూడు చక్రాల రెట్రోఫిటెడ్ మోటారు వాహనాలు -మిగతా 2లో

# ఐటీకి సిలికాన్ వ్యాలీ.. క్వాంటమ్‌కు అమరావతి

'సిలికాన్ వ్యాలీ నుంచి క్వాంటమ్ వ్యాలీకి– అమరావతి నుంచి భారత క్వాంటమ్ భవిష్యత్తు నిర్మాణం' అన్న అంశంపై ఆయన ఆన్‌లైన్‌లో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇస్తూ ప్రసంగించారు.

'క్వాంటమ్ టాక్ బై సీఎం సీబీఎన్' కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**వివిధ దశల్లో 14 లక్షల మందికి శిక్షణ**

అమరావతి క్వాంటమ్ వ్యాలీ అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వ విజన్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. వివిధ స్థాయిల్లో విద్యార్థులకు శిక్షణనిచ్చి నిపుణులుగా తయారుచేసేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసినట్టు చెప్పారు. "క్వాంటమ్ మెకానిక్స్, ఆల్గరిథమ్స్, కంప్యూటింగ్ ఫండమెంటల్స్ లాంటి ఫౌండేషన్ కోర్సుల్లో 10లక్షల మందికి శిక్షణ ఇస్తాం. అడ్వాన్స్‌డ్ స్థాయిలో సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, సెన్సింగ్ అంశాల్లో 3లక్షల మంది నిపుణుల్ని తయారుచేస్తాం. నీతి ఆయోగ్ లక్ష్యం మేరకు అడ్వాన్స్‌డ్ రీసెర్చ్, ఎన్‌క్యూఎం హబ్ ఇంటిగ్రేషన్, స్టార్టప్ ఇంక్యుబేషన్‌లో లక్ష మంది డెవలపర్లను సిద్ధం చేస్తాం. వివిధ సంస్థలు అవి అందజేసే కోర్సులు, సామర్థ్యాన్ని బట్టి మాతో భాగస్వాములుగా చేరొచ్చు" అని సీఎం పేర్కొన్నారు.

'క్వాంటమ్ టాక్ బై సీబీఎన్' కార్యక్రమానికి వర్చువల్‌గా హాజరై మాట్లాడుతున్న విద్యార్థి

**అమరావతిలోనే పూర్తి సప్లై చైన్ తయారీ**

భవిష్యత్తులో క్వాంటమ్ సప్లై చైన్‌కి అవసరమైన మొత్తం పరికరాల్ని అమరావతిలోనే ఉత్పత్తి చేస్తామన్నారు. రాష్ట్ర యువతకు వేలకొద్దీ అత్యధిక వేతనంతో కూడిన ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. "క్వాంటమ్ కంప్యూటర్లలో వినియోగించే 85% పరికరాలను తయారుచేస్తున్న కంపెనీలు ఇప్పటికే రాష్ట్రప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాయి. మిగతా 15% రావడం పెద్ద కష్టం కాదు. సూపర్ కండక్టింగ్, న్యూట్రల్ ఆటమ్, ఫోటానిక్, అయాన్–ట్రాప్ టెక్నాలజీలతో అన్ని రకాల క్వాంటమ్ కంప్యూటర్లు అభివృద్ధి చేస్తాం. ఏఐ, మెషీన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, క్వాంటమ్ మెటీరియల్స్ వంటి నెక్స్ట్ జనరేషన్ నైపుణ్యాలు పెంపొందిస్తాం. క్రయోజెనిక్స్, సెమీకండక్టర్ల నుంచి ఆల్గరిథమ్స్, ఏఐ ఎనేబుల్డ్ అప్లికేషన్ల వరకూ అమరావతి నుంచే అందజేస్తాం" అని సీఎం తెలిపారు. క్వాంటమ్ రంగంలో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్‌ను మించిన ప్రదేశం మరొకటి లేదని, వేగం, ఆవిష్కరణ, కార్యాచరణల్లో మనతో ఎవరూ సరితూగలేరని తెలిపారు.'క్వాంటమ్ టాక్ బై సీఎం సీబీఎన్' కార్యక్రమానికి వర్చువల్‌గా హాజరైన విద్యార్థినితో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

**అప్పుడు ఐటీ విజన్... ఇప్పుడు క్వాంటమ్ విజన్**

మూడు దశాబ్దాల క్రితం ఐటీ విజన్‌తో అద్భుతమైన ఫలితాలు సాధించామని సీఎం తెలిపారు. ఇప్పుడు క్వాంటమ్ కంప్యూటింగ్‌లోనూ ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచపటంలో నిలిపేందుకు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. "ఐటీ విప్లవాన్ని అందిపుచ్చుకుని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ నిపుణుల్ని తయారుచేసి ప్రపంచానికి అందించాం. సైబరాబాద్ అభివృద్ధితో హైదరాబాద్ ప్రపంచ ఐటీహబ్‌గా ఎదిగింది. అప్పట్లోనే మైక్రోసాఫ్ట్‌ని హైదరాబాద్‌కి తీసుకొచ్చాం" అని పేర్కొన్నారు. ప్రపంచంలోని దిగ్గజ ఐటీ కంపెనీలకు సుందర్ పిచాయ్, సత్య నాదెళ్ల, అరవింద్ కృష్ణ వంటి భారతీయ మూలాలున్నవారే సీఈఓలుగా ఉన్నారని గుర్తుచేశారు. "ఏపీని క్వాంటమ్‌తో పాటు, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా మారుస్తున్నాం" అని సీఎం పేర్కొన్నారు.

**ఆర్థికంగా పుంజుకుంటున్నాం**

"చైనా 1978లోనే ఆర్థిక సంస్కరణలకు తెరతీస్తే, మనం 1991లో ప్రారంభించాం. సరళీకృత ఆర్థిక విధానాలు, ప్రపంచీకరణ, నాలెడ్జ్ ఎకానమీ, మేకిన్ ఇండియా, స్టార్టప్, స్కిల్, డిజిటల్ ఇండియా, జీఎస్టీ లాంటి చర్యల వల్ల ఆర్థికంగా పుంజుకున్నాం. నాలుగో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఆవిర్భవించాం" అని సీఎం వివరించారు. "మన డీఎన్‌ఏలోనే విజ్ఞానం ఉంది. క్రీస్తుపూర్వం 2,500లోనే పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్‌లో మనం నిష్ణాతులం. క్రీ.పూ.900 నాటికే ఆరోగ్య రంగం, యోగ విద్యల్లోను, క్రీ.పూ.600 నాటికి ఆయుర్వేద వైద్యంలోను మనం అగ్రగణ్యులం. క్రీ.పూ.138లోనే సిల్క్‌రూట్ ఏర్పాటైంది. క్రీ.శ.427లో నలంద విశ్వవిద్యాలయం ఏర్పాటైంది. క్రీ.శ.500లో ఆర్యభట్ట 'సున్నా'ను

## మొదటి పేజీ తరువాయి

కనిపెట్టారు. అప్పటికే లోహశాస్త్రంలో దిట్టలం. క్రీ.శ.600లో చదరంగం కనిపెట్టాం" అని సీఎం చంద్రబాబు తెలిపారు.

**రాబోయే 22 ఏళ్లు కీలకం**

"2047 నాటికి భారత్‌ను అగ్రశ్రేణి ఆర్థికవ్యవస్థగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రాబోయే 22 ఏళ్లు మనకు కీలకం. ఈ కాలాన్ని జారవిడుచుకుంటే మళ్లీ సాధించలేం. డీప్‌టెక్, క్వాంటమ్ కంప్యూటింగ్ విజన్‌ని మీరంతా అందిపుచ్చుకోవాలి. 5–7 ఏళ్లు కష్టపడితే భవిష్యత్తులో మీరు కోరుకున్నది జరుగుతుంది. టెక్నాలజీలో మౌలికాంశాలపై పట్టుసాధించి మెదడుకు సానబెడితే అద్భుతాలు చేస్తారు" అని సీఎం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర శాస్త్ర, సాంకేతికశాఖ కార్యదర్శి అభయ్ కరాండికర్, మద్రాస్, తిరుపతి ఐఐటీల డైరెక్టర్లు సత్యనారాయణ, కామకోటి, వైసర్ కంపెనీ డైరెక్టర్ ప్రాచీ వఖారియా తదితరులు పాల్గొన్నారు.

**ఏపీ నాయకత్వం వహిస్తుంది... అనుసరించదు**

ఏ సాంకేతిక విప్లవమైనా ఆంధ్రప్రదేశ్ నాయకత్వం వహిస్తుందే తప్ప ఎవరినీ అనుసరించదని చంద్రబాబు స్పష్టంచేశారు. "అమరావతిలో క్వాంటమ్ ఎకోసిస్టంను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించాం. క్వాంటమ్ అప్లికేషన్ల ద్వారా వ్యక్తిగత ఔషధాలు, వ్యాధుల్ని ముందే గుర్తించి నివారించడం వంటివి సాధ్యమవుతాయి. మరింత సామర్థ్యం, వేగం, కచ్చితత్వం సాధించవచ్చు. క్వాంటమ్ టెక్నాలజీలో 'ఫస్ట్ మూవర్' ప్రయోజనాల్ని భారతీయులు అందిపుచ్చుకోవాలి" అని సీఎం సూచించారు. క్వాంటమ్ కంప్యూటింగ్‌లో శిక్షణ పొందేందుకు పేర్లు నమోదుచేసుకోవాలని తాను పిలుపునిస్తే... 48 గంటల్లో 54వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వారిలో 51% విద్యార్థినులు ఉండడం విశేషమని తెలిపారు. ఇప్పటికే ఈ టెక్నాలజీలో రాష్ట్రంలో 870 కాలేజీలు మైనర్ డిగ్రీలు, 53 కాలేజీలు మేజర్ డిగ్రీలు, ఆంధ్రా యూనివర్సిటీ బీటెక్ కోర్సు అందజేస్తున్నాయని తెలిపారు. 1,056 మంది శిక్షణ పొందిన అధ్యాపకులు ఉన్నారన్నారు. 134 టీచింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేస్తున్నామని, 84 ఆల్గరిథమ్ రీసెర్చ్ ప్రతిపాదనలు ఉన్నాయని సీఎం వివరించారు.

# దివ్యాంగులకు త్వరలో త్రిచక్ర మోటారు వాహనాలు

అందిస్తామని వెల్లడించారు. నియోజకవర్గానికి 10 మంది చొప్పున 1,750 మంది దివ్యాంగులకు రూ.17.50 కోట్ల విలువైన వాహనాలు అందిస్తామన్నారు. దివ్యాంగుల కోసం విశాఖలో రూ.200 కోట్లతో పారా స్పోర్ట్స్ స్టేడియం నిర్మిస్తున్నట్లు తెలిపారు.

# టీటీడీలో అక్రమాలను వెలికితీస్తున్నాం

వాడే నెయ్యితో సహా అన్ని పదార్థాలను కఠినంగా పరీక్షించాకే వినియోగిస్తున్నామని తెలిపారు.రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా ఏకాదశి రోజున 'వైకుంఠం దర్శనం' ద్వారా 90 శాతానికి పైగా సామాన్య భక్తులకు దర్శన భాగ్యం కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని మంత్రి పేర్కొన్నారు. అసలు దేవుడిపై నమ్మకం లేని వ్యక్తికి టీటీడీ లాంటి పవిత్ర సంస్థ బాధ్యతలు అప్పగించడమే గత ప్రభుత్వపు పెద్ద తప్పిదమని ప్రజలు భావిస్తున్నారన్నారు.

**కూటమి పాలనలో అభివృద్ధి పరుగులు**

గత ఆరు నెలలుగా కూటమి ప్రభుత్వ పనితీరుకు ప్రజల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోందని జనార్ధన్ రెడ్డి చెప్పారు. డీఎస్సీ, పోలీస్ కానిస్టేబుల్ నియామకాలు చేపట్టామని, సీఐఐ సదస్సుల ద్వారా రాష్ట్రానికి వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు విశ్వసనీయ గమ్యస్థానంగా మారిందన్నారు. కొత్త పోర్టులు, ఐదు విమానాశ్రయాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు.

**ప్రతిపక్షం తీరు మారాలి**

ప్రతిపక్ష నేతలు పెట్టుబడిదారులను భయపెట్టేలా మాట్లాడటం దురదృష్టకరమని, వారి బెదిరింపులకు ఎవరూ భయపడరని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలు వైసీపీని 151 సీట్ల నుంచి 11 సీట్లకు పరిమితం చేసినా ఆ పార్టీ నేతలకు ఇంకా బుద్ధి రాలేదని విమర్శించారు. అసెంబ్లీకి రాకుండా జీతాలు తీసుకోవడం కాదని, ప్రజా సమస్యలపై చర్చించేందుకు సభకు హాజరుకావాలని హితవు పలికారు.

గత ప్రభుత్వంలో నిర్వీర్యమైన ఆర్అండ్‌బీ శాఖను పునరుద్ధరించి, ఏడాదిలోనే రూ. 3000 కోట్ల విలువైన రహదారి పనులకు అనుమతులు ఇచ్చామని తెలిపారు. సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లను నిర్మించడమే లక్ష్యంగా పనులు వేగవంతం చేశామని, జూన్ చివరికల్లా పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తామని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

# వృద్ధురాలికి ఇచ్చిన మాట కోసం.. ఇప్పటంలో పవన్ పర్యటన

ఇంటికి వెళ్లారు. ఆయనకు వృద్ధురాలు ఆప్యాయంగా స్వాగతం పలికారు. ఆమెను పవన్ ఆత్మీయ ఆలింగనం చేసుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. వృద్ధురాలికి రూ.50వేలు, ఆమె మనవడి చదువుకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. నాగేశ్వరమ్మ కుటుంబసభ్యులతో ఆయన మాట్లాడారు. ఆమె మనవడి చదువు కోసం ప్రతి నెలా తన వేతనం నుంచి రూ.5వేలు ఇవ్వాలని పవన్ నిర్ణయించారు.అనంతరం నాగేశ్వరమ్మ మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం పవన్ తమ ఇంటికి రావడం సంతోషంగా ఉందన్నారు. ఇంటికి పెద్ద కుమారుడిలా యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారని ఆమె చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటామన్నారని తెలిపారు.

# ఆప్కోలో సంక్రాంతి రాయితీలు: మంత్రి సవిత

ఆప్కో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి. 60% రాయితీపై వస్త్రాల అమ్మకాల కోసంగుంటూరు చేనేత ఏడీ కార్యాలయం ఆవరణలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలి. మంగళగిరిలోని యర్రబాలెంలోనూ ప్రత్యేక కౌంటర్ ప్రారంభించాలి. విజయవాడలోని ఆప్కో మెగా షోరూంలో 50% రాయితీపై అమ్మకాలు చేయాలి. రాష్ట్రంలోని మిగిలిన అన్ని షోరూంలలో 40% రాయితీ వర్తింపజేయాలి" అని ఆదేశించారు.

# మన ప్రభుత్వం వస్తుంది.. ధైర్యంగా ఉండండి

ప్రభుత్వం నుంచి సమస్యలు ఎదుర్కొంటున్నామని, పోలీసులు కూడా తమను ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. 'మన ప్రభుత్వం వస్తుంది.. ఓపికతో, ధైర్యంగా ఉండండి' అని జగన్ వారితో అన్నారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, బద్వేలు, రాజంపేట ఎమ్మెల్యేలు సుధ, ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు గోవిందరెడ్డి, రామచంద్రారెడ్డి, వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, తదితరులు జగన్‌ను కలిశారు.

# రుషికొండ ప్యాలెస్ వినియోగంపై సబ్ కమిటీ భేటీ

అట్మాస్పియర్ కోర్ వంటి గ్రూపులు ప్రాజెక్టుల కోసం ముందుకు వచ్చాయని పయ్యావుల వెల్లడించారు. రుషికొండ నిర్మాణాలపై మళ్లీ రెండు ఫ్లోర్లు వేసుకునే అవకాశం ఉందని తెలిపారు. మరో మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ... ఆదాయం వచ్చే భవనాలను కూల్చి ప్యాలెస్ కట్టారంటూ గత వైసీపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. రుషికొండ వినియోగానికి సంబంధించిన అనేక ప్రపోజల్స్ వస్తున్నాయని తెలిపారు. రుషికొండ కింద 9 ఎకరాల్లో సముద్రం ఆటుపోట్ల కారణంగా రెండెకరాలు మాత్రమే అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

# 20 లక్షల ఉద్యోగాలే లక్ష్యం

## స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనపై సీఎం చంద్రబాబు సమీక్ష

**20 లక్షల ఉద్యోగాల కల్పనే మొదటి ప్రాధాన్యత అని స్పష్టీకరణ**

**పది సూత్రాలను పది మిషన్లుగా అమలు చేయాలని అధికారులకు ఆదేశం**

**నీటి భద్రత, వ్యవసాయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన**

**'మేడ్ ఇన్ ఆంధ్ర' బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తం చేయాలని దిశానిర్దేశం**



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 24)**

స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్య సాధన కోసం రూపొందించిన పది సూత్రాలను పది మిషన్లుగా స్వీకరించి పనిచేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. పాలనలో వేగాన్ని పెంచి, ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు ప్రతి ప్రభుత్వ శాఖ పనితీరును తెలిపే ప్రత్యేక సూచికలను (ఇండికేటర్లు) సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. సచివాలయంలో ఇవాళ ఆయన స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలు, పది సూత్రాల అమలుపై నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే అత్యంత ప్రాధాన్యతాంశమని స్పష్టం చేశారు. నైపుణ్యం పోర్టల్ ద్వారా ఉద్యోగాల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని సూచించారు. జీరో పావర్టీ మిషన్‌లో భాగంగా రాష్ట్రంలోని 30 లక్షల పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా కలిగే ప్రయోజనాన్ని అంచనా వేయాలని, ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యమన్నారు.

నీటి భద్రతను కీలక మిషన్‌గా పరిగణించి, నీటి వనరుల సమర్థ వినియోగంపై దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు తెలిపారు. నీటి ఆడిట్ నిర్వహించాలని, వివాదాలకు తావులేకుండా చూడాలని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు సస్యశ్యామలంగా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు. రైతుల ఆత్మహత్యల నివారణకు పటిష్టమైన కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు.

'మేడ్ ఇన్ ఆంధ్ర' బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తంగా ప్రోత్సహించాలని, అరకు కాఫీ తరహాలో రాష్ట్ర ఉత్పత్తులకు నాణ్యతతో కూడిన గుర్తింపు తీసుకురావాలని సీఎం సూచించారు. రవాణా వ్యయాన్ని తగ్గించేందుకు లాజిస్టిక్స్ మాస్టర్ ప్లాన్, స్వచ్ఛాంధ్ర కోసం సర్క్యులర్ ఎకానమీ, సాంకేతికత వినియోగంతో పౌర సేవలను సులభతరం చేయడం వంటి అంశాలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




# విద్యారంగంపై ఖర్చు... మానవ వనరుల వృద్ధికి పెట్టుబడి

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 24)**

విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వం పెట్టే ఖర్చు పిల్లల భవిష్యత్తు, మానవ వనరుల వృద్ధికి పెడుతున్న పెట్టుబడి అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. పిల్లలకు పోషకాహారం అందించి ఆరోగ్యవంతులుగా, విజ్ఞానవంతులుగా తయారు చేస్తే రానున్న రోజుల్లో రాష్ట్ర సంపద పెరుగుతుందన్నారు. విద్యార్థులు ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల వారితో పోటీపడితేనే 2047 విజన్ డాక్యుమెంట్ ప్రకారం 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యాన్ని తెలంగాణ చేరుకుంటుందని చెప్పారు. అందుకోసం కలెక్టర్లతోపాటు జిల్లా అధికారులు ప్రతినెలా ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలను పర్యవేక్షించి... విద్యార్థుల పురోగతి, సమస్యల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో విద్య, సంక్షేమంపై జిల్లా అధికారులతో బుధవారం భట్టి విక్రమార్క సమీక్షించారు. విద్యాసంస్థల వారీగా పురోగతిని, సమస్యలను తెలుసుకున్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు ఏటా నిబంధనల ప్రకారం రెన్యువల్ చేసుకోవాలన్నారు. వాటికి నిబంధనల ప్రకారం అనుమతులివ్వాలని, తప్పిదాలు జరిగితే బాధ్యులపై చర్యలుంటాయని హెచ్చరించారు.

ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు లక్షిత లబ్ధిదారులకు చేరాలని, పథకాల అమలులో నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు ముఖ గుర్తింపు పద్ధతి(ఎఫ్ఆర్ఎస్)లో హాజరు నమోదు చేయాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని చెప్పారు. గిరిజనులకు సమగ్ర వ్యవసాయాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ఇందిర సౌర గిరి జలవికాస పథకం అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పోడు భూములపై హక్కులు పొందినవారికి సౌర విద్యుత్తు, పంపుసెట్లు, బిందు సేద్యం, ప్లాంటేషన్ కల్పనకు ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వరంగ సంస్థల భవనాలపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకొని... హరిత ఇంధనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరతరం కృషి

రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి
డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి

4

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# అధునాతన సాంకేతికతతో 5 విడతల్లో

# 342 సెల్ ఫోన్లు రికవరీ



**అధునాతన సాంకేతికతతో 5 విడతల్లో 342 సెల్ ఫోన్లు రికవరీ**
**బాధితులకు అందజేసిన జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు**
**ఇప్పటి వరకు జిల్లాలో సుమారు రూ.9.50 కోట్ల విలువ గల**
**6,447కు పైగా మొబైల్ ఫోన్లను ట్రేస్ చేసి బాధితులకు అందజేసిన జిల్లా పోలీసులు**
**పోయిన తమ మొబైల్ ఫోన్లను పోలీసులు అత్యంత త్వరితగతిన**
**రికవరీ చేసి అందజేయడంతో బాధితుల్లో అపారమైన ఆనందం వ్యక్తం**
**మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 24)**

ప్రజలు వివిధ కారణాల వల్ల తమ మొబైల్ ఫోన్లను కోల్పోయి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే భావనతో జిల్లా ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించి, జిల్లా పోలీస్‌శాఖ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రజల ఆస్తుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ పనిచేస్తోంది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ మిస్సింగ్ మొబైల్ ఫోన్లను ట్రేస్ చేయుటకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గుర్తించడం జరుగుతుందని తెలిపారు. మొబైల్ ట్రేసింగ్ ద్వారా గత 3 నెలల కాలంలో ప్రస్తుత 5 విడతలో రికవరీ చేసిన 342 మొబైల్ ఫోన్ల విలువ సుమారు రూ.50 లక్షలుగా ఉందన్నారు. రికవరీలో యాపిల్, శాంసంగ్, వివో, రెడ్‌మి, ఒప్పో, వన్‌ప్లస్ తదితర కంపెనీలకు చెందిన మొత్తం 342 మొబైల్ ఫోన్లను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా గుర్తించి, బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సంబంధిత బాధితులకు అందజేయడం జరిగిందన్నారు. 01.11.2021 నుండి ఇప్పటి వరకు 5 విడతల్లో కలిపి మొత్తం 6,776 మొబైల్ ఫోన్లను రికవరీ చేయడం జరిగింది. వీటి మొత్తం విలువ సుమారు రూ.9.50 కోట్లుగా ఉంది. ఈ మొబైల్ ఫోన్లను మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా గుర్తించి సంబంధిత బాధితులకు అందజేయడం జరిగిందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఎవరైనా ఎక్కువ విలువ గల మొబైల్ ఫోన్‌ను తక్కువ ధరకు సెకండ్ హ్యాండ్ రూపంలో విక్రయించేందుకు ప్రయత్నిస్తే, ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ అటువంటి ఫోన్లను కొనవద్దని ఎస్పీ సూచించారు. అలాగే ఎవరైనా అనుమానాస్పదంగా మొబైల్ ఫోన్లు అమ్మడానికి వస్తే, వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఒకవేళ సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్ కొనాల్సిన పరిస్థితి వస్తే, తప్పనిసరిగా సక్రమమైన బిల్లును పరిశీలించి మాత్రమే కొనాలని సూచించారు. నేటి కాలంలో మొబైల్ ఫోన్ మన జీవితంలో ఒక భాగమైందని, వాటిలో వ్యక్తిగత సమాచారం మరియు విలువైన డేటా నిల్వ ఉండుట వల్ల ప్రజలు తమ మొబైల్ ఫోన్లు పోకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ పేర్కొన్నారు. ఒకవేళ మీ సెల్ ఫోన్ ఎవరైనా చేతికి చిక్కినట్లయితే, వారు ఆ ఫోన్‌ను ఉపయోగించి నేరాలకు పాల్పడే అవకాశమున్నదని, అందువల్ల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**ఫిర్యాదు చేయు విధానం :**

మొబైల్ పోయినప్పుడు బాధితులు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని ఎస్పీ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఈఐఆర్ వెబ్‌సైట్ లాస్ట్ మొబైల్ ఆప్షన్ ద్వారా ఐఎంఈఐ నెంబర్లు, ఫోన్ బిల్లు, గవర్నమెంట్ జారీచేసిన ఐడీ ప్రూఫ్ వివరాలు నమోదు చేసి ఫిర్యాదు నమోదు చేయవచ్చు. పోలీస్ వాట్సాప్ నెంబర్ 9121102266కు పంపవచ్చునని, అవసరం అయితే మొబైల్ పోయినప్పుడు బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయవచ్చు.

**తీసుకోవలసిన జాగ్రత్తలు:**

మొబైల్ ఫోన్ పోయిన వెంటనే సిమ్ కార్డు బ్లాక్ చేయించు కోవడం. బ్యాంకు కు లింక్ అయిన మొబైల్ నెంబర్ ను మార్చుకోవడం. గుర్తుతెలియని వ్యక్తులకు మీ మొబైల్ ఫోన్‌ను ఇవ్వకూడదు. ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో దొరికిన మొబైల్ ఫోన్లను తీసుకుని వాడడం చేయరాదని, వాటిని స్థానికంగా పోలీసు స్టేషన్లలో అప్పగించాలని కోరారు. అనేక వినూత్న కార్యక్రమాల ద్వారా జిల్లా ప్రజలకు ఉత్తమ పోలీస్ సేవలు అందిస్తున్న జిల్లా ఎస్పీకి, పోలీసు సిబ్బందికి బాధితులు వారి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఫోన్లను రికవరీ చేయడంలో ప్రతిభ కనబరచిన జిల్లాలోని పోలీస్ అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.



# సహకార సంఘాల బలోపేతం ఆర్థికాభివృద్ధికి, సామాజిక సాధికారతకు కీలకం



సహకార సంఘాల అభివృద్ధి తోనే రైతులు,
మహిళల ఆర్థికాభివృద్ధి
సహకార సంఘాల ఆదాయం పెంపే లక్ష్యంగా
కూటమి ప్రభుత్వం పని చేస్తోంది
మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి
పామూరులో సహకార సంఘం పెట్రోల్ బంక్
ప్రారంభించిన మంత్రి స్వామి

4

# జిల్లాలో జరుగుతున్న వివిధ ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్**




**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, డిసెంబర్ 24)**

జిల్లాలో జరుగుతున్న వివిధ ప్రాజెక్టు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి వినోద్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి నేషనల్ హైవే, ఆర్ అండ్ బి, రైల్వే, పర్యాటక, ఫిషరీస్, విద్య, వైద్యశాఖలకు సంబంధించి జిల్లాలో జరుగుతున్న ప్రాజెక్టు పురోగతిపై సంబంధిత శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూజిల్లాలో జరుగుతున్న వివిధ ప్రాజెక్టుల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. అన్ని ప్రాంతాలకు రవాణా సౌకర్యం, రహదారులు మెరుగ్గా ఉంటే వెనువెంటనే అభివృద్ధి జరుగుతుందన్నారు. ముఖ్యంగా జాతీయ రహదారుల నిర్మాణాలతో ప్రజల ప్రయాణాలు ఎంతో సులభంగా మారుతాయన్నారు. వాడరేవు-పిడుగురాళ్ల జాతీయ రహదారి- 167 ఏ త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. గుంటూరు- నిజాంపట్నం రహదారి నిర్మాణం, నిడుబ్రోలు- చందోలు ఆర్ అండ్ బి రహదారి విస్తీర్ణం పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. (తరువాయి 4లో...)



# అరుణాచలేశ్వరస్వామిని దర్శించుకున్న మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కుటుంబసభ్యులు



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిసెంబర్ 24)**

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కుటుంబ సమేతంగా బుధవారం తమిళనాడులోని తిరువన్నామలైలో అరుణాచలేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంతలక్ష్మి, కుమారుడు కందుల విగ్నేష్‌రెడ్డి, కుమార్తె కందుల దివ్య నందినులు స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు, అధికారులు వారిని ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారి ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందించి శాలువాతో సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో వారి వెంకట వెలుగొండ దేవస్థాన ఉత్సవాల కమిటీ ఛైర్మన్ కుందూరు కాశిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# ప్రైవేటు ఆసుపత్రులలో అధిక ఓపీ ఛార్జీలను అరికట్టాలి

### నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు ఆసుపత్రుల పై చర్యలు తీసుకోవాలి




**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, డిసెంబర్ 24)**

జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ ఆసుపత్రుల పై చర్యలు తీసుకోవాలని, ప్రజల వద్ద నుండి అధిక మొత్తంలో ఓపీ ఫీజును అరికట్టాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. బుధవారం జిల్లా కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు రోగాలు నయం చేసుకోవడానికి ఆసుపత్రులకు వస్తే జనాలను వివిధ రకాల టెస్టులతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, దారుణం ఏంటంటే ఓపీ ఫీజులు రూ.400 నుండి రూ.600 వరకు ఛార్జ్ చేస్తున్నారని అన్నారు. గత్యంతరం లేక ఆసుపత్రులకు వస్తె ఇంత ఫీజుల అని ప్రశ్నించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఈ స్థాయిలో ప్రైవేటు ఆసుపత్రులు నిలువు దోపిడీ చేస్తుంటే అధికారులు ఏమి చేస్తున్నారని అన్నారు. ఆసుపత్రి లోని మందులు షాప్ లో ఫార్మాసిస్టు లు ఉండరని, డయాగ్నస్టిక్ సెంటర్ లతో మాట్లాడుకుని అధిక మొత్తంలో టెస్టులు రాస్తున్నారని అన్నారు. అధికారులు ఇప్పుడుకైనా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ఆసుపత్రుల పై చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాటిపై కఠిన చర్యలు తీసుకొని లేకుంటే డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు విశ్వనాథ్ నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

# క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసిన వైసీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్

### క్రీస్తు జన్మదినం బంధు, మిత్రులతో ఉమ్మడి కుటుంబాల మధ్య సంతోషంగా జరుపుకోవాలి



**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, డిసెంబర్ 24)**

లోక రక్షకుడు ప్రభువైన యేసుక్రీస్తు జన్మదినం క్రిస్మస్ శుభాకాంక్షలు క్రైస్తవ సోదర సోదరీమణులతో పాటుగా కందుకూరు నియోజకవర్గ ప్రజలందరికీ ఇంచార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ తెలిపారు. క్రీస్తు జన్మదినం లోకానికి వెలుగులను తీసుకువచ్చిందని, మానవాళి అందరికీ మంచిని పంచిందని క్రీస్తు బోధించిన దయ, కరుణ, ప్రేమ,వాత్సల్యాలను ప్రజలందరూ పాటించి తమ వ్యక్తి గత జీవితాలను ఆనందమయంగా మలుచుకోవాలని కోరుతూ క్రీస్తు జన్మదినం సందర్భంగా క్రిస్మస్ శుభాకాంక్షలు నియోజకవర్గ ప్రజలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ప్రపంచ మానవాళి రక్షణ కొరకు ప్రభువైన ఏసుక్రీస్తు కన్యగర్భమున జన్మించి పాపులను రక్షించుటకు రక్తం ద్వారా పాప విమోచన కాగించారని ఆయన జీవించినంత కాలం బోధించిన ఆదర్శాలు ఆచరణీయమని తెలిపారు. ఈ క్రిస్మస్ ను క్రైస్తవ సోదరులందరూ ఆనందోత్సవాల మధ్య బంధు,మిత్రులతో కలిసి ఉమ్మడి కుటుంబాల సమక్షంలో క్రీస్తు జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

# ఎమ్మెల్యే ఉగ్రను కలిసిన ఆకుపాటి



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, డిసెంబర్ 24)**

కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్ష పదవి చేపట్టిన సందర్భంగా బుధవారం జిల్లా ఎంపిటిసిల సంఘం అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈయన వెంట 278 బూత్ కన్వీనర్ నీరుకట్టు రసూల్, సభ్యులు ఇండ్ల నరసింహారావు, తాళ్లపల్లి వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరతరం కృషి





సంక్రాంతి పండుగ తర్వాత ఇప్పటికే నమోదు చేసుకున్న ఇళ్లను ప్రాధాన్యత క్రమంలో అందరి ఇవ్వటం జరుగుతుందన్నారు. కొత్తగా రేషన్ కార్డులు ఇచ్చామన్నారు. భర్త చనిపోయిన వెంటనే పెన్షన్లు ఇస్తున్నాం. ఉగాది తరువాత కొత్త పెన్షన్లు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధం గా ఉందని ఆయన తెలిపారు. దర్శిలో ఆగిపోయిన డ్రైవింగ్ స్కూల్‌ను మళ్ళీ తిరిగి తీసుకువస్తామన్నారు. దర్శిలో కొన్ని గురుకుల పాఠశాలలను కూడా తీసుకువస్తే గత ప్రభుత్వం ఆపిందని మరలా వాటిని తిరిగి తీసుకువస్తున్నట్లు మంత్రి తెలిపారు. మీరు అందరూ కోరుకున్నట్లు గానే దర్శిని ప్రకాశం జిల్లాలో ఉంచామన్నారు. ఈ నియోజకవర్గ అభివృద్ధికి నిరతరం కృషి చేస్తున్న ఇంచార్జి గొట్టిపాటి లక్ష్మిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ దర్శి నియోజకవర్గ అభివృద్ధి కొరకు తనవంతు సహాయ సహకారం అందిస్తామన్నారు. పేద, వెనుకబడిన ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మా ప్రభుత్వానికి అబివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళన్నారు. కనిగిరి ఎమ్మెల్యే, జిల్లా టీడీపీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహరెడ్డి మాట్లాడుతూ మన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిత్యం ప్రజల కోసం పని చేస్తోందని చెప్పారు. ఇంత గొప్పగా అభివృద్ధి చేస్తున్న మన ప్రభుత్వం కి ప్రజలు ఎప్పుడూ అండగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రతి క్షణం కష్టపడుతున్నట్లు ఆయన చెప్పారు. దర్శి నియోజకవర్గ ఇంచార్జి గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ, ప్రజా ప్రభుత్వంగా ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేలా ముఖ్యమంత్రి కష్టపడుతున్నారని చెప్పారు. దర్శి నియోజకవర్గానికి ఏ అవసరం ఉన్న మన మంత్రి, ఎంపీ పూర్తి సహాయ సహకారం అందిస్తున్నందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. దర్శి నియోజకవర్గ ప్రజలు చిన్న సమస్య కూడ తన సమస్యగా భావించి పని చేస్తున్నట్లు ఆమె అన్నారు. అనంతరం పాస్టర్లకి బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘాల బలోపేతం ఆర్థికాభివృద్ధికి, సామాజిక సాధికారతకు కీలకం





**(షణ్ముఖ వెలుగు, పామూరు, డిసెంబర్ 24)**

సహకార సంఘాల బలోపేతమే ఆర్థికాభివృద్ధికి, సామాజిక సాధికారతకు మూలాధారమని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. పామూరులో బుధవారం సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సహకార సంఘాల అభివృద్ధి ద్వారా రైతులు, మహిళలకు ఆర్థికంగా బలమిచ్చే అవకాశం విస్తృతంగా ఉందన్నారు. సహకార సంఘాల ఆదాయం పెరిగితే సభ్యుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని మంత్రి పేర్కొన్నారు. రైతులు, మహిళలు స్వయం ఉపాధి అవకాశాలతో ముందుకు సాగేందుకు సహకార రంగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఇటువంటి ఆదాయ వనరులు సృష్టించడం ద్వారా సహకార సంఘాలు స్వావలంబన దిశగా అడుగులు వేయగలవని తెలిపారు. సహకార సంఘాల ఆదాయం పెంపే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో పనిచేస్తోందని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి చెప్పారు. కొత్త వ్యాపార అవకాశాలు, మౌలిక వసతుల అభివృద్ధి, పారదర్శక నిర్వహణ ద్వారా సహకార రంగాన్ని మరింత బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే , జిల్లా పార్టీ అధ్యక్షులు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, సహకార సంఘ సభ్యులు, అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరతరం కృషి

**(షణ్ముఖ వెలుగు, దర్శి ఇన్‌ఛార్జి, డిసెంబర్ 24)**

అన్ని వర్గాల అబివ ృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరతరం కృషి చేస్తోందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. బుధవారం దర్శి నియోజకవర్గం, కురిచేడు మండలంలోని అవులమంద పంచాయతీ లో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, దర్శి నియోజకవర్గ ఇంచార్జి గొట్టిపాటి లక్ష్మీలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ అవులమంద పంచాయతీలో సుమారు కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, మినీ గోకులం షెడ్డులను ప్రారంభించడం ఎంతో ఆనందదాయకమన్నారు. పాస్టర్ల పెండింగ్ బకాయిలను కూడా ప్రభుత్వం విడుదలచేసిందని ఆయన తెలిపారు.గతంలో తెలుగుదేశం ప్రభుత్వం చర్చిల నిర్మాణాలకి మంజూరు చేస్తే వాటిని గత ప్రభుత్వం ఆపేసిందని, ఇప్పుడు మరలా చర్చి నిర్మాణాలకు నిధులు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కొరకు క ృషి చేస్తున్నామని మంత్రి చెప్పారు. ఎన్నికల ముందు చెప్పిన ప్రతి హామీని ప్రభుత్వం తుచాతప్పక అమలు చేస్తున్నట్లు ఆయన అన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం లో బాగంగా ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి పిల్లలకి తల్లుల ఖాతాలలో నగదు జమ చేస్తున్నాం, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, ఆడపడుసులందరికీ ఉచిత బస్సు ప్రయాణం వంటి ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. త్వరలో హెల్త్ ఇన్సూరెన్స్ ఏ హాస్పిటల్‌లో అయిన రూ.25 లక్షల వరకు అన్ని వర్గాల ప్రజలు వైద్యం చేసుకునే విదంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

# జిల్లాలో జరుగుతున్న వివిధ ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలి

కర్లపాలెం-గణపవరం రహదారి పనులు ప్రతివారం పురోగతిపై నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్మాణాలపై సూక్ష్మ ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. స్వదేశీ దర్శన్ కింద మంజూరైన ప్రాజెక్ట్ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సూర్యలంక బీచ్ లో నిర్మాణాలు వేగంగా చేపట్టాలన్నారు. బోటింగ్ కొరకు కెనాల్ చుట్టూ చిల్ల చెట్లు తొలగింపు పూర్తి చేయకపోవడంపై ఆరా తీశారు. వాహనాలకు పార్కింగ్ సమస్య లేకుండా చూడాలన్నారు. హరిత రిసార్ట్స్ భవనం ఆధునికికీకరణ పనులు వేగంగా చేపట్టాలన్నారు. చీరాల ఏరియా ఆసుపత్రిలోని క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణం అత్యంత వేగంగా చేయాలన్నారు. ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ నిర్మాణం త్వరలో పూర్తిచేసి ప్రారంభించాలన్నారు. ఆర్టిజం సెంటర్, భవిత సెంటర్ల ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించాలన్నారు. పిల్లల సంక్షేమానికి తగినట్టుగా నిబంధనలు సవరించుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇబ్బందులను తొలగించుకుంటూ లక్ష సాధన వైపు అధికారులు పని చేయాలన్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భారత గడ్డ పై సిపిఐకి వందేళ్ళు
# పేదల పక్షాన అలుపెరిగిన పోరాటం చేసేది కమ్యూనిస్టులే

## సిపిఐ కనిగిరి మండల కార్యదర్శి జీపీ రామారావు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 24)

భారతదేశ రాజకీయాలలో సిపిఐ పార్టీ వందేళ్ల త్యాగాల, పోరాటాల ప్రజాప్రస్థానం గర్వించదగినదని, పేదల పక్షాన అలుపెరిగిన పోరాటాలు చేసేది కమ్యూనిస్టులే అని, స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని ఎన్డీఏ ప్రభుత్వం నీరుగారుస్తున్నదని సిపిఐ మండల కార్యదర్శి రామారావు అన్నారు. సిపిఐ వందేళ్ళ వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా కనిగిరి పట్టణంలోని హనీఫ్ నగర్ శాఖలో హనీఫ్ స్మారక స్థూపం వద్ద సిపిఐ జెండాను రామారావు ఎగురవేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ 1925, డిసెంబర్ 26 ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో సిపిఐ పార్టీ ఆవిర్భవించి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా భారతదేశంలో సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని పిలుపునిచ్చినటువంటి ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. దేశంలో వందేళ్ళ చరిత్ర కలిగిన పార్టీలు సిపిఐ, కాంగ్రెస్ పార్టీలు మాత్రమేనన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న అనేక మంది త్యాగాలు చేశారని, జైలుకెళ్లారని, ప్రాణాలు సైతం తృణపాయంగా అర్పించారన్నారు. ఈ పోరాటంలో పాల్గొన్న వారందరూ స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తింపబడ్డారన్నారు. ఈ సందర్భంగా సయ్యద్ హనీఫ్, సయ్యద్ జాఫర్, చిన హుస్సేన్ పోరాటాలు త్యాగాలు మరువలేనివన్నారు. వారి ఆశయాలను కొనసాగించాలని వారి యొక్క స్ఫూర్తితో ముందుకు





పోవాలన్నారు. కమ్యూనిస్టుపార్టీలు, వ్యవసాయ కార్మిక సంఘాలు అందరి సహకారంతో యుపిఏ 1 ప్రభుత్వంలో తెచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసే కుట్ర ఎన్డీఏ ప్రభుత్వం చేస్తున్నదని మండిపడ్డారు. దేశ స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొనని ఆర్ఎస్ఎస్ కనుసనల్లో ప్రధాని నరేంద్ర మోడీ స్వాతంత్రోద్యమ పితామహుడు మహాత్మా గాంధీ పేరును సంక్షేమ పథకాలకు తీసేస్తూ దేశ స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని నీరుగారుస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో సిపిఐ వందేళ్ళ వార్షికోత్సవ ప్రజా ప్రస్థానం స్ఫూర్తితో పాలకులనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పై ప్రజా పోరాటాలకు ప్రజలు సమాయత్తం కావాలన్నారు. 2026 జనవరి 18న ఖమ్మంలో జరిగే జాతీయ స్థాయి సిపిఐ వందేళ్ళ ముగింపు ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లాసమితి సభ్యులు పందిటి మోహన్, పుట్టా సుబ్బారావు, షేక్ ఖాసీంపీరా, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పవన్ కళ్యాణ్, సిపిఐ సీనియర్ నాయకులు సయ్యద్ మౌలాలి, సయ్యద్ జిలాని, షరీఫ్, అమృల్లా, బషీరా, కోటయ్య, ఏసుబాబు, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ పిచ్చయ్యను సన్మానించిన ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంఘ నాయకులు



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, డిసెంబర్ 24)

గిద్దలూరు మండల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మాజీ అధ్యక్షులు డాక్టర్ పిచ్చయ్య తన పదవీకాలంలో గిద్దలూరు మండల ఉపాధ్యాయులకు అనునిత్యం అందుబాటులో ఉండి విశేష సేవలు అందించారు. ఉపాధ్యాయ సమస్యలను జిల్లా నాయకత్వానికి చేరవేటంలోనూ, జిల్లా కేంద్రంలోని పనులు చేయటంలోనూ ఎంతో కృషి చేశారు. మండల కమిటీ సమిష్టి కృషితో అత్యధిక సభ్యత్వం నమోదు చేసిన మండలంగా గిద్దలూరును జిల్లాలో మొదటి స్థానంలో నిలబెట్టారు. నూతన కమిటీ ఎన్నిక సమావేశానికి హాజరైన జిల్లా ఉపాధ్యక్షులు రామిరెడ్డి, జిల్లా కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ రమణారెడ్డి, తదితరులు అభినందించారు. వీరి సేవలు గుర్తించి మాజీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంఘ నాయకులు బొబ్బిడి పాండు దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# సూదనగుంట, తుమ్మగుంట గ్రామాల్లో పొలం పిలుస్తుంది



(షణ్ముఖ వెలుగు, పొదిలి, డిసెంబర్ 24)

మండలంలోని సూదనగుంట, తుమ్మగుంట గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు కంది, మిరపంటలను పరిశీలించడం జరిగింది. ప్రస్తుతం సాగులో ఉన్నటువంటి కంది పూత, పిందె దశలో ఉంది. అక్కడక్కడ పొలాల్లో మారుక మచ్చల పురుగు లేదా గూడు పురుగు, బెట్ట పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయి. కావున రైతు సోదరులు పైన తెలిపిన పురుగులు పొలంలో గమనించిన వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా బెట్ట పరిస్థితులు ఉన్నప్పుడు ఒక ఎకరానికి రెండు కేజీల యూరియాను లేదా పొటాషియం నైట్రేట్ పిచికారి చేసి కొంతమేర బెట్ట పరిస్థితుల నుండి కొంత మేర పంటను రక్షించవచ్చునని రైతులకు తెలియజేశారు. అంతేగాక మిరప పంటను కూడా పరిశీలించి ప్రస్తుత సాగులో ఉన్నటువంటి మిరప పంటలలో ఆకు పై ముడత రోగం ఎక్కువగా కనిపిస్తున్నది ఈ పై ముడత రావడానికి కారణం నల్ల తామర పురుగుల ఉధృతి ఎక్కువగా ఉండటం వలన ఆకులన్నీ సన్న బారి ముడతలు ముడతలుగా ఉండి పడవ ఆకారంలో ఉండి పైరు ఎదుగుదలకు మరియు పంట దిగుబడులకు కూడా నష్టం వాటిల్లెవిధంగా ఈ తామర పురుగు రసం పిలుస్తు ఉంటాయి. కావున రైతులు ఈ ముడత తీవ్రత ఎక్కువగా గమనించినప్పుడు నివారణ చర్యలుగా అసిఫేట్ 300 గ్రాములు లేదా ఇమిడా క్లోఫ్రెడ్ 100 మిల్లీలీటర్లు లేదా థయోమెతాగ్జామ్ అనే ముందును 100 గ్రాములు చొప్పున ఒక ఎకరానికి పిచికారి చేసి నివారించుకోవచ్చునని ఆయన రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వ్యవసాయ సహాయకులు శ్రీలేఖ, రైతులు పాల్గొన్నారు.



# జీవీఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం గురించి అవగాహన




(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, డిసెంబర్ 24)

మండల కేంద్రమైన ఉలవపాడు జివిఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి ఎల్ సుధారాణి అధ్యక్షతన కన్స్యూమర్ క్లబ్ కోఆర్డినేటర్ ఎస్ హరిత వినియోగదారుల హక్కుల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రస్తుత ఈ కామర్స్ ప్రపంచంలో నాణ్యమైన వస్తువులను మరియు సేవలను పొందడం గురించి వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలని, వస్తు సేవల వినియోగంలో సమస్యలు తలపినప్పుడు గ్యారెంటీ మరియు వారంటీ కార్డులను ఉపయోగించుకొని కాలపరిమితిలోపు వస్తువులను బాగు చేయించుకునే అవకాశం గురించి చక్కగా వివరించారు. కన్స్యూమర్ క్లబ్ కో ఆర్డినేటర్ ఎస్ హరిత మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టం 1986, భారతదేశంలో వినియోగదారులకు వస్తు సేవల వినియోగానికి సంబంధించి ప్రధానంగా ఆరు రకాలైన హక్కులను కల్పించడం జరిగింది. వాటికి భంగం వాటిల్లినప్పుడు వినియోగదారుల ఫోరం ద్వారా న్యాయపరిహారం పొందే మార్గాన్ని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎం బాబురావు మాట్లాడుతూ వినియోగదారులు వస్తు సేవలో వినియోగంలో వాటి మీద ముద్రించిన ధరలకంటే ఎక్కువ ధరలు చెల్లించాల్సిన అవసరం లేదని, అలా ఎవరైనా వసూలు చేస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఐక్యుఎసి కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్ మాణిక్యరావు, ఇతర అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.




## మానవత్వం చాటుకున్న ఆలేటి నాగయ్య



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 24)

మానవత్వం పరిమలించే మంచి మనసుకు స్వాగతం. వివరాల్లోకి వెళ్ళితే ప్రకాశం జిల్లా, యర్రగొండపాలెం టౌన్ నందు గల ఏ పీజెఏసి ఎంప్లాయిస్ ఆఫీస్ నందు ఆలేటి సొసైటీ అధ్యక్షులు ఆలేటి నాగయ్య, క్రిస్టమస్ పర్వదినం పురస్కరించుకొని పేదలకు, అంధులకు దుప్పట్లు పంపిణి చేసి మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో యం వెంకటసుబ్బయ్య, ఆగుంటు అబ్రహం, బి చిన్నయ్య, కొంతమంది నియోజకవర్గంలోని పేదలు, అంధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరు ఆలేటి నాగయ్యను ప్రసంశించారు.

## క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు

### మాజీ మంత్రి శిద్దా రాఘవరావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 24)

క్రిస్మస్ అంటే ఏసు ప్రభువును ఆరాధించే రోజు. విశ్వవ్యాప్తంగా ప్రజలందరిలో ప్రేమ, సహనం, శాంతి, కరుణ కూడిన, విశ్వాసపూరితమైన, ఏసుక్రీస్తు చూపిన మార్గం మనందరికీ ఆచరణీయం అని మాజీ మంత్రి శిద్దా రాఘవరావు అన్నారు. క్రైస్తవ సోదర, సోదరీమణులు సమాజ శాంతి, సామరస్యం కోసం ఏసు ప్రభువును భక్తిశ్రద్ధలతో ప్రార్థించాలని కోరారు. రాష్ట్ర ప్రజలు క్రిస్మస్ పండగ సంతోషంగా జరుపుకోవలని ఆకాంక్షించారు. .క్రైస్తవ సోదరులకు తన హృదయపూర్వక క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియచేస్తునట్లు ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

## నియోజకవర్గ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు

### వైసీపీ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి మూలే



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, డిసెంబర్ 24)

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి మూలే గోపాల్‌రెడ్డి కనిగిరి నియోజకవర్గ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీస్తు బోధనలు అనుసరణీయమని, ప్రపంచ శాంతికి అవి మార్గదర్శకాలని అన్నారు. కనిగిరి నియోజకవర్గంలోని క్రైస్తవులందరూ పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అదే విధంగా నియోజకవర్గంలోని క్రైస్తవులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని ఆయన తెలిపారు.

## జిల్లా ప్రజలందరికీ క్రిస్టమస్ శుభాకాంక్షలు

### షేక్ సైదా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, డిసెంబర్ 24)

ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే క్రిస్టమస్ పండుగను ప్రకాశం జిల్లా క్రైస్తవ సోదరులందరూ ఘనంగా జరుపుకోవాలని ఏసుక్రీస్తు బోధనలను ఆచరించాలని, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా కోరారు. క్రిస్టమస్ సందర్భంగా ప్రకాశం జిల్లా ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు, అధికారులకు జర్నలిస్ట్ మిత్రులకు, క్రైస్తవ సోదర సోదరీమ ణులకు, ప్రభు భక్తులందరికీ షేక్ సైదా శుభాకాంక్షలు తెలిపారు.

## ఈ నెల 27న సర్వసభ్య సమావేశం

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, డిసెంబర్ 24)

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 27వ తేదీన జరుగునని ఎంపీడీవో డాక్టర్ పి సుజాత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు మండలంలోని జడ్పిటిసి ఎంపీటీసీ సర్పంచులు ప్రజా ప్రతినిధులు అధికారులు హాజరుకావాలని ఆమె తెలిపారు.

## కందుకూరు నియోజకవర్గ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు

ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, డిసెంబర్ 24)

ఈ రోజున మీకొరకు రక్షకుడు జన్మించాడు – అనే పవిత్ర వాక్యం ద్వారా క్రీస్తు ప్రభువు జన్మ మానవాళికి శాంతి, ప్రేమ, ఆశలను అందించింది. శాంతి మీకు కలుగునుగాక – అనే క్రీస్తు సందేశం ప్రతి ఒక్కరి హృదయంలో నిలిచి, సమాజంలో సోదరభావం, కరుణ, మానవత్వం పెంచింది. ఈ పవిత్ర క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ప్రతి కుటుంబానికి ఆరోగ్యం, శ్రేయస్సు, సుఖసంతోషాలు కలగాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరుకుంటూ, ప్రజలందరూ ఆనందోత్సాహాలతో, శాంతియుత వాతావరణంలో క్రిస్మస్ వేడుకలను జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు.

## క్రిస్మస్ కానుకగా రూ.50 కోట్లు అందజేసిన చంద్రబాబు

ఏపీ ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సాతులూరి కుమార్



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, డిసెంబర్ 24)

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,కూటమి ప్రభుత్వం ప్రపంచవ్యాప్తంగా క్రీస్తు పుట్టిన రోజు సందర్భంగా జరుపుకునే క్రిస్మస్ పండుగ సందర్భంగా పాస్టర్లకు రూ.50 కోట్లు విడుదల చేశారని ఏపీ ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సాతులూరి కుమార్ అన్నారు. మాచర్ల వ్యక్తిగత కార్యాలయంలో జరిగిన పత్రిక సమావేశంలో పాల్గొన్న కుమార్ మాట్లాడుతూ ఎస్సీలు దేశంలో అత్యున్నత ఉద్యోగాలైన ఐఏఎస్, ఐపీఎస్ శిక్షణకు ఉచిత కోచింగ్ సెంటర్లను పెట్టి ,దళితులు సివిల్స్ లో ఉద్యోగాలు సాధించాలని కొన్ని కోట్ల రూపాయలు దళితులకు కేటాయించడం చంద్రబాబు నాయుడుకే సాధ్యమని అన్నారు.ఈమధ్య ముస్లిమ్స్ సమాజాన్ని గౌరవించి మౌజంలకు కూడా కోట్ల రూపాయల విడుదల చేసి గొప్ప మనసు చాటుకున్నారని కొనియాడారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అందరి వాడినని చెప్పి క్రైస్తవులను, ముస్లింలను, దళితులతో పాటు అన్ని వర్గాలను దారుణంగా మోసం చేశాడని గుర్తు చేశారు. అన్ని వర్గాల అభివృద్ధికి సముచిత స్థానం కల్పించే నాయకులు చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ మాత్రమే అని దళిత జాతి ఉన్నంతవరకు చంద్రబాబుతోనే మా ప్రయాణం అని వ్యాఖ్యానించారు.

## ఒంగోలు నియోజకవర్గ ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు

ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 24)

ఈ రోజున మీకొరకు రక్షకుడు జన్మించాడు – అనే పవిత్ర వాక్యం ద్వారా క్రీస్తు ప్రభువు జన్మ మానవాళికి శాంతి, ప్రేమ, ఆశలను అందించింది. శాంతి మీకు కలుగునుగాక – అనే క్రీస్తు సందేశం ప్రతి ఒక్కరి హృదయంలో నిలిచి, సమాజంలో సోదరభావం, కరుణ, మానవత్వం పెంచింది. ఈ పవిత్ర క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ప్రతి కుటుంబానికి ఆరోగ్యం, శ్రేయస్సు, సుఖసంతోషాలు కలగాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరుకుంటూ, ప్రజలందరూ ఆనందోత్సాహాలతో, శాంతియుత వాతావరణంలో క్రిస్మస్ వేడుకలను జరుపుకోవాలని ఒంగోల ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు కోరారు.

# చిన్నారుల ఆరోగ్యానికి బాల భవిత కేంద్రం భరోసా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 24)

చిన్నారులకు చదువు ఎంత ముఖ్యమో ఆరోగ్యం అంతే ముఖ్యం ఆరోగ్యకరమైన బాల్యాన్ని అందించినప్పుడే భవిష్యత్తు సంతోషంగా ఉంటుంది. ఈ లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము చర్యలు తీసుకుంటుంది జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బిఎస్‌కె)లో భాగంగా చైల్డ్ హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తోంది. ప్రకాశం జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాలలో గల విద్యార్థిని, విద్యార్థులను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్రీయ బాల స్వస్త్య కార్యక్రమం (ఆర్‌బిఎస్‌కె)లో భాగంగా ఒంగోలు, మార్కాపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలల నందు గల డిస్టిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌ల (డిఈఐసి) వారిచే పిల్లలకు వైద్య పరీక్షలు చురుగ్గా సాగుతున్నాయి. పసిపిల్లలలో పుట్టుకతో వచ్చే సమస్యలు ద్వారా 4లు గుర్తించి, పుట్టుకతో వచ్చే లోపాలు, ఎదుగుదలలో ఆలస్యం, పోషకాహార లోపాలు, బాల్యంలో వచ్చే వ్యాధులు సకాలంలో వారికి ఉచితంగా చికిత్సను అందిస్తున్నారు.




**బాలలకు ఆరోగ్య పరీక్షలు జరిగే తీరు :**

ఏఎన్ఎంలు మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు (ఎంఎల్‌హెచ్‌పి)లు విద్యార్థుల వద్దకే వెళ్లి పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులలో రక్తహీనత, ఎత్తు, బరువు, కంటి, వినికిడి పరీక్షలు మానసిక రుగ్మతలు, దంత సమస్యలు, చర్మసంబందిత వ్యాధులు ఇలా శరీరంలో ప్రతి వ్యాధికి సంబంధించి స్క్రీనింగ్ చేసి వివరాలను ఏపీ హెల్త్ యాప్ లో నమోదు చేస్తారు.

**వ్యాధి తీవ్రతను బట్టి :**

అంగన్వాడీలు, ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు, భవిత కేంద్రాలలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు కూడా ఈ పరీక్షలు నిర్వహిస్తారు. స్క్రీనింగ్ లో సమస్యలున్న విద్యార్థులకు వైద్యాధికారి పర్యవేక్షణలో వ్యాధి తీవ్రతను బట్టి సి హెచ్ సి లేదా ప్రాంతీయ ఆసుపత్రులలో చికిత్స అందిస్తారు 18 ఏళ్ల లోపు పిల్లలకు ఈ పరీక్షలు నిర్వహిస్తారు.

**ఏ ఏ లోపాలు గుర్తించారంటే ...**

సాధారణంగా విద్యార్థుల్లో వంకర దంత సమస్యలు, చర్మ సమస్యలు, పోషకాహార లోపాలు, కంటి సంబంధిత సమస్యలు, బుద్ధి మాంద్యం, మానసిక సమస్యలు తదితర లోపాలను గుర్తించారు.

పుట్టుకతో వచ్చే లోపాలకు

**శస్త్ర చికిత్స ల ద్వారా చిన్నారులకు రక్ష :**

పుట్టుకతో వచ్చే లోపాలకు (ఆర్‌బిఎస్‌కె) ద్వారా చిన్నారులకు గుండె సంబంధిత , గ్రహణం మొర్రి ,వంకర పాదాలు, కంటి శాస్త్ర చికిత్స, నాడీ సంబంధిత శాస్త్ర చికిత్సలు, నాలుకకు సంబంధించిన శస చికిత్సలు చేయడం జరుగుతుంది.

**పిల్లలు ఈ జాగ్రత్తలు పాటించాలి ...**

స్వచ్ఛమైన నీరు తీసుకోవాలి నోరు ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలి సామాజిక భౌతిక దూరం పాటించాలి. క్రమశిక్షణతో పౌష్టికాహారం తీసుకోవాలి. చరవానికి దూరంగా ఉండాలని, నడక విధిగా వ్యాయామం చేయాలి.

**యాప్ లో నమోదు :**

రక్తహీనత, ఎత్తు, బరువు, కంటి, వినికిడి పరీక్షలు మానసిక రుగ్మతలు, దంత సమస్యలు కాలానుగున చర్మవ్యాధులు ఇలా మొత్తం విద్యార్థులకు సంబంధించిన స్క్రీనింగ్ వివరాలు ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ హెల్త్ యాప్‌లో పొందుపరుస్తున్నామన్నారు.

**జిల్లాలో పరిస్థితి ఇది :**

0– 18 ఏళ్లలోపు విద్యార్థులు : 404091, 4 డీలుగా గుర్తించినది : 1388, పోషకాహార లోపాలు : 286, బాల్యంలో వ్యాధులు : 314, పుట్టుకతో లోపాలు : 22, ఎదుగుదలలో లోపాలు : 123, ఇతర ఆరోగ్య సమస్యలు : 643, జిల్లాలోని బాలబాలికలకు ఆరోగ్య రక్ష కార్డులు. అంగన్వాడీలు, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నటువంటి విద్యార్థిని విద్యార్థుల ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేస్తున్నట్లు డిఎమ్‌హెచ్‌ఓ డాక్టర్ టి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష కార్డులను విడుదల చేశారు. డిఎమ్‌హెచ్‌ఓ డాక్టర్ టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చిన్నారుల విద్యార్థుల వివరాలతో కూడిన ఈ కార్డులతో వారికి ఐదేళ్ల వరకు అన్ని రకాల ఆరోగ్య సేవలను పూర్తి ఉచితంగా అందిస్తామన్నారు.

**బాల బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టేందుకు :**

ఈ మధ్యకాలంలో బాల బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టేందుకు రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమం (ఆర్‌బిఎస్‌కె ) ద్వారా మండల స్థాయి అవగాహన కార్యక్రమాలను ఏర్పాటుచేసి విరివిగా ప్రచారం చేయడం జరుగుతుంది తద్వారా పిల్లలపై లైంగిక నేరాలు జరగకుండా అడ్డుకట్ట వేయడం జరుగుతుంది. చిన్నారులకు రాష్ట్రీయ బాల స్వస్త్య కార్యక్రమం ద్వారా సంవత్సరానికి రెండుసార్లు డి వార్మింగ్ మాత్రల పంపిణీ చేస్తారన్నారు.

**డి ఈ ఐ సి ద్వారా బాల బాలికలకు" వాహనం " ఏర్పాటు :**

చిన్నారుల రాకపోకలకు రాష్ట్రీయ బాల స్వస్త్య కార్యక్రమం ద్వారా వాహనం ఏర్పాటు చేసి విద్యార్థిని, విద్యార్థులను పాఠశాల నుండి సురక్షితంగా తీసుకువచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి అనంతరం సురక్షితంగా పాఠశాల కు చేర్చడం జరుగుతుంది.

**బాల భవిత కేంద్రం ద్వారా అందించబడే వివిధ రకాల సేవలు :**

పిల్లలలో వచ్చే అన్ని రకాల వ్యాధులకు వైద్యం, దంత సమస్యలకు వైద్యం, ఫిజియోథెరపీ విభాగం, మానసిక సమస్యలకు కౌన్సిలింగ్, కంటి సంబంధిత వైద్య సహాయం, పుట్టుకతో వచ్చే సమస్యలను గుర్తించబడే విభాగం, అడాల సెంట్ ఫ్రెండ్లీ హెల్త్ క్లినిక్ సేవలు. పిల్లలకు వైద్య పరీక్షల నిమిత్తం లేబరేటరీ సేవలు.

**అప్రమత్తతే ముఖ్యం :**

పిల్లలందరూ ఆరోగ్యంగా ఉండాలని లక్ష్యంతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నాము. ఈ పరీక్షలలో లోపాలు ఉన్నట్లు గుర్తించిన చిన్నారులకు ప్రత్యేక చికిత్స అందిస్తామని తెలిపారు.

# భార్యను హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**రూ.15 వేలు జరిమానా విధించిన ఒంగోలు 2వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి**

**నిందితుడికి శిక్ష పడటంలో సమర్ధవంతంగా విధులు నిర్వహించిన పోలీస్ అధికారులను, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించిన జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు**




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 24)

ప్రకాశం జిల్లా, కొత్తపట్నం మండలం, ఈతముక్కల గ్రామానికి చెందిన తాబేటి కృపారావు (35)కు మద్దిపాడు మండలం, రాచవారిపాలెం గ్రామానికి చెందిన సుభాషిని (33)తో 14 సంవత్సరం క్రితం వివాహం జరిగింది. వివాహం అయిన కొద్దికాలం తరువాత తాబేటి కృపారావు మద్యానికి బాని సై, పనికి వెళ్లకుండా భార్యపై అనుమానాలు పెంచుకొని ఆమెను శారీరకంగా, మానసికంగా వేధిస్తూ ఉండేవాడు. ఈ వేధింపులు తట్టుకోలేక సుభాషిని ఈతముక్కల గ్రామంలో తన అక్క సునీత వద్దకు వెళ్లి నివసిస్తోంది. ఈ క్రమంలో పెద్దల సమక్షంలో రాజీ కుదుర్చుకొని, నిందితుడి మాటలు నమ్మి సుభాషిని మళ్లీ భర్త వద్దకు వెళ్లింది. అయితే 24.12.2015 రాత్రి, తాబేటి కృపారావు సుభాషిణిని రోకలిబండతో కొట్టి చంపిన ఘటన ఫిర్యాదిపై కొత్తపట్నం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసింది. అప్పటి ఒంగోలు టూ టౌన్ సీఐ పి దేవప్రభాకర్ అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు పంపించి, అనంతరం కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. పోలీసులు సమయానుసారం సాక్షులను కోర్ట్ నందు హాజరు పరుచగా అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ యత్తపు కొండారెడ్డి, రామేశ్వరరెడ్డి ప్రాసిక్యూషన్ తరుపున వాదించారు. జిల్లా ఎస్పీ మార్గదర్శకత్వంలో ప్రత్యేక మానిటరింగ్ టీం ద్వారా సమర్థవంతంగా ట్రయల్ నడిపి సరైన సాక్ష్యాదారాలతో నిందితుడుపై పలు సెక్షన్‌ల క్రింద నేర నిరూపణ చెయ్యడంతో 24.12.2025న ఒంగోలులోని ఒంగోలు 2వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి పందిరి లలిత జీవిత ఖైదీ, రూ.15వేలు జరిమానా విధించారు. సాక్షులను సరైన సమయంలో హాజరుపరచిన నిందితునికి శిక్ష పడేందుకు కోర్టు లైజన్ ఏఎస్ఐ లక్ష్మీనారాయణ, అలాగే కొత్తపట్నం కోర్టు పిసి ప్రసాద్ తోడ్పడ్డారు. పై కేసులో ముద్దాయికి శిక్ష పడటంలో కృషి చేసిన పోలీస్ అధికారులను, పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్ట్ లైజన్ సిబ్బందిని ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ప్రత్యేకంగా అభినందించారు.

# క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన పోతినేని శ్రీనివాసరావు

**క్రీస్తు జన్మదినం బంధు, మిత్రుల మధ్య సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు**

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 24)

క్రైస్తవ సోదరీ సోదరీమణులతో పాటు నియోజకవర్గ, మద్దిపాడు మండల ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు ఆయన



మాట్లాడుతూ లోక రక్షకుడు ప్రభువైన యేసుక్రీస్తు జన్మదినం లోకానికి వెలుగులను తీసుకువచ్చిందని, మానవాళి అందరికీ మంచిని పంచిందని క్రీస్తు బోధించిన దయ, కరుణ, ప్రేమ, వాత్సల్యాలను ప్రజలందరూ పాటించి తమ వ్యక్తి గత జీవితాలను ఆనందమయంగా మలుచుకోవాలని కోరుతూ క్రీస్తు జన్మదినం సందర్భంగా క్రిస్మస్ శుభాకాంక్షలు ప్రపంచ మానవాళి రక్షణ కొరకు ప్రభువైన ఏసుక్రీస్తు కన్యగరమ్మున జన్మించి పాపులను రక్షించుటకు రక్తం ద్వారా పాప విమోచన కలిగించారని ఆయన జీవించినంత కాలం బోధించిన ఆదర్శాలు ఆచరణీయమని తెలిపారు. ఈ క్రిస్మస్ ను క్రైస్తవ సోదరులందరూ ఆనందోత్సవాల మధ్య బంధు, మిత్రులతో కలిసి ఉమ్మడి కుటుంబాల సమక్షంలో క్రీస్తు జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

# రాష్ట్రంలో వసతి గృహాల నిర్వహణలో సమగ్రమైన మార్పులు

## రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి









(షణ్ముఖ వెలుగు, దర్శి ఇన్‌ఛార్జి, డిసెంబర్ 24)

రాష్ట్రంలో వసతి గృహాల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం సమగ్రమైన మార్పులు తీసుకొస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. బుధవారం దర్శి నియోజకవర్గం, తాళ్ళూరు మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన కస్తూరిబాయి బాలికా వసతి గృహాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మీలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దాదాపు 8 సంవత్సరాల క్రితం తమ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాలికా విద్యా ప్రసాదంలో భాగంగా ఈ బిల్డింగ్ మంజూరు చెయ్యటం జరిగిందన్నారు. ఈ బాలికా వసతి గృహం యొక్క ప్రాధాన్యతను గుర్తించి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్ళి ఆయన సహకారంతో మిగిలిన ఈ నిర్మాణం పూర్తి చేశారన్నారు. ఈ రోజు ఈ హాస్టల్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందని ఆయన చెప్పారు. వసతి గృహాల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం సమగ్రమైన మార్పులు తీసుకొస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. పిల్లలకి అవసరం అయిన త్రాగు నీరు ప్లాంట్, నాణ్యమైన బియ్యం అదే విధంగా విద్యార్థులకి సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి కిట్‌ను అందిస్తున్నారు. అందులో బ్యాగ్, బుక్స్, బూట్లు, టై, యూనిఫాం వంటివి ఉన్నాయన్నారు. పరీక్షలు దగ్గరపడిన నేపథ్యంలో 100 రోజుల యాక్షన్ ప్లాన్ తీసుకుని గుణాత్మక, నాణ్యమైన విద్యను ప్రభుత్వం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ వసతి గృహం కూడా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందన్నారు. నియోజకవర్గ ఇంచార్జి లక్ష్మీ బీసీ కాలేజీ బాయ్స్ వసతి గృహం కావాలని అడిగారని, ఎంత మంది బీసీ విద్యార్థులు ఉన్నా కూడా ఎస్సీ హాస్టల్‌లో అడ్మిషన్ కల్పించి ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నడుపుతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు లాగా భావిస్తున్నారన్నారు. రోడ్ల నిర్మాణం, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, అన్నా క్యాంటీన్లు, అన్నదాత సుఖీభవ, దీపం2, తల్లికి వందనం, ఉచిత బస్సు లాంటి అనేక సంక్షేమ, అభివృద్ధి పనులు అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి మట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు కోసం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ హాస్టల్స్ విద్యార్థులకి అవసరం అయిన వసతులు పూర్తి స్థాయిలో కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. హాస్టల్స్ అభివృద్ధి కోసం మంత్రి పూర్తి స్థాయిలో పనిచేస్తున్నట్లు ఆయన చెప్పారు. దర్శి నియోజకవర్గ అభివృద్ధి కోసం పని చేస్తున్న ఇంచార్జి గొట్టిపాటి లక్ష్మీని ఆయన అభినందించారు. దర్శి నియోజకవర్గ ఇంచార్జి గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన విద్య తోపాటు, భద్రమైన వసతి, మంచి భవిష్యత్ విద్యార్థులకి ఇవ్వాలని స్పష్టమైన లక్ష్యంతో పని చేస్తుందన్నారు. పేద, వెనుకబడిన బాలికలను ముందుకు తీసుకువెళ్లాలని నిర్ణయం చాలా మెచ్చుకోదగిందని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారి శీఘ్రదర్శన టోకెన్ల జారీకి రంగం సిద్ధం

### 25, 26 తేదీల్లో భక్తులకు శీఘ్ర దర్శనం టోకెన్ల పంపిణీ

### శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి వెల్లడి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 24)

ఈ నెల 30వ తేదీ మంగళవారం వైకుంఠ ఏకాదశి (ముక్కోటి) పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు తమ కుటుంబ సభ్యులతో తక్కువ సమయంలో శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు వీలుగా ఈ నెల 25, 26 తేదీలలో శీఘ్రదర్శన టోకెన్ల జారీ ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, అర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి , కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు బుధవారం వెల్లడించారు. ఒక్కో శీఘ్ర దర్శనం టోకెన్ పై నలుగురు కుటుంబ సభ్యులను శ్రీవారి దర్శనానికి అనుమతించడం జరుగుతుందని పేర్కొన్నారు. శీఘ్ర దర్శనం టోకెన్ల కోసం భక్తులు ఎటువంటి రుసుమును చెల్లించవలసిన అవసరం లేదని పూర్తిగా ఉచితంగానే శీఘ్ర దర్శనం టోకెన్లను అందజేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. శీఘ్ర దర్శనం టోకెన్లను పొందగోరు భక్తులు శ్రీగిరి దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని ఆధార్ కార్డును వెంట తీసుకు వెళ్లాలని సూచించారు, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి నిర్వాహకులు కోరారు.

# అనుమతులు లేని అక్రమ లేఓట్లు తొలగింపు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 24)

ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి రాష్ట్ర వ్యాప్తంగా అనధికార లేఓట్లు లను తొలగించుటలో భాగంగా ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని కొప్పోలు, రాజీవ్ గృహకల్ప, పోతురాజుపాలెం సచివాలయ పరిధిలోని సర్వే నెం 625, 26, 36 అనుమతులు లేని అక్రమ లేఓట్లును పట్టణ ప్రణాళిక విభాగపు అధికారులు జేడ్ సుధాకర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ కె బాబురావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, షేక్ రసూల్, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్, పట్టణ ప్రణాళిక సిబ్బంది, పలు అక్రమ లేఅవుట్లు తొలగించడమైనది. కొప్పోలు, రాజీవ్ గృహకల్ప, పోతురాజుపాలెం అనుమతులు లేని అక్రమ లేఅవుట్లలోని హద్దు రాళ్ళను జెసిబి సహాయంతో తొలగించడమైనది. నగరపాలక సంస్థ పరిధిలోని అనధికార లేఓట్లను ఏర్పాటు చేసిన యజమానులు మీ ప్లాట్లను, అనధికారిక లేఓట్లను స్కీము క్రింద క్రమబద్ధీకరించు కొనవలసినదిగా తెలియజేయడమైనది. అట్లు రెగ్యులరైజేషన్ చేయించుకొనటువంటి అనధికార లేఓట్ ప్లాట్లు తొలగింపు కార్యాక్రమము జరుగుతూ ఉంటుందని తెలిపారు.



# రోడ్డు భద్రతపై పోలీసుల ప్రత్యేక నిఘా

## హెల్మెట్ వాడకంపై అవగాహన

### రహదారి నిబంధనలు పాటించండి సీఐ మల్లికార్జున



(షణ్ముఖ వెలుగు, కంభం, డిసెంబర్ 24)

కంభం రహదారి నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని కంభం పోలీసులు సూచించారు. బుధవారం కంభం పట్టణంలోని ప్రధాన కూడలి అయిన వై జంక్షన్ వద్ద పోలీసులు వాహనదారులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ మల్లికార్జున, ఎస్ఐ శివ కృష్ణారెడ్డి నేతృత్వంలో సిబ్బంది వాహనాలను తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారికి రోడ్డు ప్రమాదాల పట్ల అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా సీఐ మల్లికార్జున మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోవడం వల్ల చిన్న ప్రమాదాలు కూడా ప్రాణాంతకంగా మారుతున్నాయని, కుటుంబ సభ్యుల క్షేమం కోసం ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సీఐ మల్లికార్జున పేర్కొన్నారు. ఎస్ఐ శివ కృష్ణారెడ్డి మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, అతివేగం, ట్రిపుల్ రైడింగ్‌ల వల్ల జరిగే నష్టాలను ఎస్ఐ శివకృష్ణారెడ్డి వివరించారు. నిబంధనలు పాటించని వాహనదారులను ఆపి, వారికి ట్రాఫిక్ రూల్స్ పై కౌన్సెలింగ్ ఇచ్చారు. రహదారి నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలందరికీ, పోలీసు సిబ్బందికి క్రిస్మస్ పండుగ పర్వదిన శుభాకాంక్షలు

### జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 24)

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించిన ఏసుక్రీస్తు మార్గం ఆచరణీయమైనదనీ, ప్రజలందరూ శాంతి, సమాధానాలతో, ప్రశాంత వాతావరణంలో, ఆనందోత్సాహాలతో క్రిస్మస్ పండుగను జరుపుకోవాలని జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఆకాంక్షించారు. సాటి మనుషుల పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, సహనం , త్యాగం వంటివి క్రీస్తు మానవాళికి అందించిన మహోన్నత సందేశమన్నారు. ఈ క్రిస్మస్ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని, అందరూ సుఖసంతోషాలతో ఉండాలన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లాలోని అన్ని ప్రధాన చర్చిలు, ప్రార్థనా మందిరాల వద్ద ఎటువంటి సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.

# జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు

### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, డిసెంబర్ 24)

కరుణామయుడు, లోక రక్షకుడు ఏసుప్రభువు జన్మించిన పర్వదినం క్రిస్మస్ వేడుకలను జిల్లా ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆనందంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆకాంక్షించారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని క్రైస్తవులందరికీ జిల్లా కలెక్టర్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. శాంతి, దయ, ప్రేమ, ధర్మం, న్యాయం, అహింస, పరోపకారం వంటి ఏసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికి ఆచరణీయమని, క్రీస్తు చూపిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ పయనిస్తూ ఉన్నతమైన జీవితాన్ని కొనసాగించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

# పాస్టర్లకు రూ.51 కోట్ల వేతన బకాయిలు చెల్లించాం

### క్రీస్తు మార్గం అందరికీ అనుసరణీయం
### కుల, మతాలకు అతీతంగా అర్హులకు పథకాలు
### సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్







(షణ్ముఖ వెలుగు, అద్దంకి, డిసెంబర్ 24)
ఏసుక్రీస్తు అనుసరించిన మార్గం అందరికీ అనుసరణీయమని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు. బుధవారం నాడు అద్దంకి నియోజకవర్గం స్థాయిలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో మంత్రి గొట్టిపాటి పాల్గొన్నారు. క్రిస్మస్ కేక్ ను కట్ చేసి క్రైస్తవులందరికీ క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని పాస్టర్లకు మంత్రి గొట్టిపాటి నూతన వస్త్రాలను బహుకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రైస్తవుల సంక్షేమానికి సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే పాస్టర్లకు చెల్లించాల్సిన రూ.51 కోట్ల గౌరవ వేతన బకాయిలను వెంటనే విడుదల చేసి లబ్ధిదారులకు అందించినట్లు ఆయన గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో మొదటిసారిగా క్రైస్తవులకు గౌరవ వేతనాన్ని అందించిన ఘనత తెలుగు దేశం పార్టీకే దక్కుతుందన్నారు. కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఓటేసిన వాళ్లను ఒకలా, వేయని వాళ్లను మరోలా కూటమి ప్రభుత్వం చూడటం లేదన్నారు. కుల, మతాల మధ్య చిచ్చు పెట్టి లబ్ధి పొందే కార్యక్రమాలకు సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం వ్యతిరేకమని మంత్రి వెల్లడించారు. ఎన్నికల తరువాత రాష్ట్రంలోని అందరినీ ఒకే దృష్టితో చూస్తున్నామని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో సంక్షేమాన్ని అందించడమే తమ లక్ష్యమని మంత్రి గొట్టిపాటి చెప్పారు. తాను ఎమ్మెల్యేగా





ఎన్నికయిన ఐదు సార్లులో తన విజయానికి అన్ని వర్గాల ప్రజలు కృషి చేశారని ఆయన హర్షం వ్యక్తం చేశారు. క్రైస్తవులు, హిందువులు, ముస్లింలు అనే భేదం లేకుండా కూటమి ప్రభుత్వం సమానంగా చూస్తుందన్నారు. అవసరమైన అందరికీ సహాయం చేస్తుందని మంత్రి గొట్టిపాటి తెలిపారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున క్రైస్తవులతో పాటు కూటమి నేతలు పాల్గొన్నారు.


## యూటీఎఫ్ గిద్దలూరు మండల శాఖ నూతన కమిటీ ఎన్నిక




(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, డిసెంబర్ 24)
గిద్దలూరు పట్టణంలోని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కార్యాలయంలో నూతన కమిటీ ఎన్నిక సమావేశానికి డాక్టర్ మొర్రి పిచ్చయ్య అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులను ఆహ్వానించి కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. సంవత్సర కాలంలో సంఘం చేసిన ఉద్యమాలు, సేవలను, నిరసనలను గురించి సభ్యులకు వివరించారు. ఆర్థిక ఆర్థిక అంశాల గురించి ట్రెజరర్ సుబ్బరాయుడు తెలియజేశారు. అనంతరం ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా ఉపాధ్యక్షులు ఐవి రామిరెడ్డి సంఘ విశిష్టతను, యూనియన్ ఆవశ్యకతను తెలియజేశారు. పాత కమిటీ ప్రవేశపెట్టిన నూతన కమిటీని ఎన్నికల అధికారి సత్యనారాయణ రెడ్డి ప్రవేశపెట్టారు. సభ్యులందరి ఏకగ్రీవ తీర్మానంతో నూతన మండల అధ్యక్షులుగా రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బాల వెంకటేశ్వర్లు, ట్రెజరర్ గా హరిప్రసాద్, గౌరవ అధ్యక్షులుగా రమణారెడ్డి, ఉపాధ్యక్షులుగా సయ్యద్ ఖాదర్, ఉపాధ్యక్షురాలుగా రంగ సుధా, తదితరులను ఎన్నుకున్నారు.

## పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోంది

### రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 24)
పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. బుధవారం టంగుటూరు మండలం, తూర్పు నాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో 37 మంది లబ్దిదారులకు రూ.30.38 లక్షల రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందించారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి విలేకరులతో మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చినప్పటినుంచి ఇప్పటి వరకు కొండెపి నియోజకవర్గ పరిధిలో ఒక వెయ్యి 280 మందికి 10 కోట్ల రూపాయల మేర ముఖ్యమంత్రి సహాయ నిధి కింద పేదలకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్ధిక సహాయం అందించడం జరిగిందన్నారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం సంజీవని పథకం ద్వారా పేదలకు వైద్య బీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు.

## ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ ఎన్సీసీ విద్యార్థికి జాతీయ స్థాయి అరుదైన గౌరవం

### లక్షద్వీప్ స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్‌కు ఎంపిక



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, డిసెంబర్ 24)
కందుకూరు పట్టణంలోని ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ ఎన్సీసీ విభాగానికి చెందిన విద్యార్థి పి షంషుద్దీన్ ప్రతిష్టాత్మకమైన స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్ (ఎస్ఎన్ఐసి) కి ఎంపిక కావడం కళాశాలకే గర్వకారణంగా నిలిచింది. ఈ జాతీయ స్థాయి ఎన్సీసీ శిబిరం లక్షద్వీప్, కావరట్టి ఐలాండ్ లో 23 డిసెంబర్ 2025 నుండి 03 జనవరి 2026 వరకు జరగనుంది. దేశవ్యాప్తంగా ఎంపికైన ఉత్తమ ఎన్సీసీ కేడెట్లు మాత్రమే ఈ శిబిరంలో పాల్గొనడం విశేషం. ఈ క్యాంప్ ద్వారా జాతీయ సమైక్యత, సాంస్కృతిక ఐక్యత, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ వంటి విలువలు విద్యార్థుల్లో మరింత బలపడతాయని పేర్కొన్నారు. పి షంషుద్దీన్ 34(ఏ) ఎన్సీసీ బెటాలియన్, ఒంగోలు పరిధిలో శిక్షణ పొందుతూ, క్రమశిక్షణ, సేవాభావం, ప్రతిభతో ఈ అరుదైన అవకాశాన్ని సాధించారని కళాశాల వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె విజయ శ్రీనివాస్ విద్యార్థిని అభినందిస్తూ, ఈ విజయంతో కళాశాల ప్రతిష్ట జాతీయ స్థాయిలో మరింత పెరిగిందని పేర్కొన్నారు. ఇలాంటి అవకాశాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. అలాగే కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ విద్యార్థి పి షంషుద్దీన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఎన్సీసీ ద్వారా విద్యార్థులు దేశ సేవకు సిద్ధమవుతారని, ఈ ఎంపిక కళాశాల ఎన్సీసీ విభాగం సాధించిన గొప్ప విజయమని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులు ఇలాంటి జాతీయ, అంతర్జాతీయ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థి సాధించిన ఈ ఘనత ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని, ఎన్సీసీ కార్యక్రమాల్లో కళాశాల ఎల్లప్పుడూ ముందుంటుందని కళాశాల యాజమాన్యం తెలిపింది.

## క్రిస్మస్ శుభాకాంక్షలు ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 24)
లోకంలో పాపులను రక్షించి, ధర్మ స్థాపనకై యేసు ప్రభువు జన్మించిన రోజును క్రిస్మస్ పండుగగా ప్రపంచ ప్రజలు భక్తి, శ్రద్ధలతో జరుపుకుంటారు. మానవాళి మనుగడకు ప్రతీకలైన సకల జీవులపై కరుణ, నీతి, ప్రేమ, శాంతి, సహాయం, సహకారం, సహనం మొదలగు మంచి గుణాలతో ప్రజలందరూ జీవించాలని క్రీస్తు బోధించాడు. జీవితంలో అనుసరణీయమైన క్రీస్తు బోధనలను అందరూ అనుసరించుచూ, దేవుని ఆరాధనతో క్రిస్మస్ పండుగను ఆనందంగా జరుపుకోవాలని కోరుచూ, జిల్లా క్రైస్తవ సోదర, సోదరీమణులకు, ప్రజలకు ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.



## క్రిస్మస్ శుభాకాంక్షలు ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, డిసెంబర్ 24)
తూర్పు రాయలసీమ ప్రకాశం, నెల్లూరు,చిత్తూరు క్రైస్తవ సోదర సోదరీమణులకు కుప్పం నియోజకవర్గ సమన్వయకర్తల చైర్మన్, శాసనమండలి విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రైస్తవ సోదరులందరూ భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ పండగ జరుపుకోవాలని ఆయన కోరారు. క్రిస్మస్ అంటే ఏసు ప్రభువును ఆరాధించే రోజు. విశ్వవ్యాప్తంగా ప్రజలందరిలో ప్రేమ,సహనం, శాంతి, కరుణ కూడిన విశ్వాసపూరితమైన, ఏసుక్రీస్తు చూపిన మార్గం మనందరికీ అనుచరణీయం అని డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. క్రైస్తవ సోదర,సోదరీమణులు అందరూ కలిసి శాంతి, సామరస్యం కోసం ఏసు ప్రభువును భక్తిశ్రద్ధలతో ప్రార్థించాలని ఎమ్మెల్సీ డాక్టర్ శ్రీకాంత్ కోరారు.


On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com